# తిరస్కృతి

'డాక్టర్ ... డా-క్ట-ర్ ... పెం...డ్లి చేసు...కోరూ, డా...క్ట...'

ఇన్‌జెక్షన్ యిస్తున్న డాక్టరు మధుసూదనరావు చేతులు వణుకుతున్నాయి. బాధతో ముఖం పక్కకు తిప్పుకొని నిల్చున్నాడు. పేషెంటు స్వరం క్షీణించిపోతున్నది. మరల మైకం వచ్చిందని తెలుసుకొని ఒక దీర్ఘనిట్టూర్పు విడిచి తనరూముకు బయలుదేరాడు.

ఎదురుగా వస్తున్న నర్సు గ్రేస్ నవుతూ 'డాక్టరుగారూ, మీ పేషెంటు ఎలావుంది? పాపం, సరే అని అనకూడదూ?' అన్నది. డాక్టరు మాట్లాడే పరిస్థితిలో లేడు. పలక్కుండా తన రూముకుపోయి కూర్చొని ఆలోచిస్తున్నాడు.

రోజూ అనేక ప్రాణాలు పోవటం చూట్టానికి అలవాటుపడ్డ యీ నర్సులకు డాక్టర్లకు ఎంత భయంకర పరిస్థితి కూడా బాధ కలిగించదు. ప్రాణం విలువే తెలియకుండా పోతుంది. కాని తను కొత్తగా యీ వృత్తి ప్రారంభించాడు. కాబట్టి పూర్తిగా హృదయం మొద్దుబారిపోలా. ఒక్కొక్క ప్రాణం పోయినప్పుడల్లా తను చాలా బాధపడతాడు. కాని యిలాంటి హృదయవిదారక దృశ్యం యింతకుముందు ఎప్పుడూ తను చూడలేదు.

ఆ అమ్మాయికి దాదాపు యిరవయినాలుగు సంవత్సరాలుండవచ్చును. రాత్రి పదిగంటలకు వార్డులో చేర్చేప్పటికి స్పృహ లేదు. తను ఇన్‌జక్షన్ యివ్వగానే కళ్ళు తెరిచింది. తెరుస్తూనే ఎదురుగా నిల్చొని వున్న తననే పిచ్చిగా చూసింది. ఆమె తన జీవితంలో అనుభవించిన బాధనంతా ఆ కళ్లలోనే దాచుకున్నదా అనిపించింది. మరల పాలిపోయి క్షీణించివున్న పెదాలు కొంచెంగా కదిలాయి. అవి ఏదో చెప్పటానికి ప్రయత్నిస్తున్నాయి. తను దగ్గరకు వొంగి వినటానికి ప్రయత్నించాడు. క్షీణస్వరంలో 'డాక్టర్ ... నన్ను ... పెండ్లి చేసుకోరూ' అన్న మాటలు విని తెల్లబోయాడు. ఆమె అదే వాక్యాన్ని రెండుమూడుసార్లు వల్లించి మరల మైకంగా పడిపోయింది.

ఆమెకు కొంచెం స్పృహ వచ్చినప్పుడల్లా అదేవాక్యం పలవరిస్తూ వున్నది. డాక్టర్‌కు ఏమిచేయాలో, ఏమనాలో బోధపడటంలేదు. ఆమె యిలా డెలీరియంలో అనటానికి కారణమేమై వుంటుందా? అని ఆలోచిస్తున్నాడు.

'డాక్టర్, పదకొండవ నెంబరు బెడ్ వెరీ సీరియస్' అన్న గ్రేసుమాటలకు వులిక్కిపడి, యంత్రంలాగ లేచి ఆమె వెంటనే భారంగా నడిచి వెళ్ళాడు.

*   *   *

గిరిజ అతిసాధారణకుటుంబంలో, చాలా చిన్నగ్రామంలో జన్మించినా, చిన్నప్పటి నుండి జీవితాన్నిగురించి ఎన్నో కలలు కనేది. చాలావరకు తన సమయాన్ని ఊహాసౌధాలలోనే గడిపేది. తనతోటి పిల్లలతో కలిసి ఎప్పుడూకూడ బొమ్మలాటలుకానీ అమ్మలాటలుగానీ ఆడేది కాదు. ఆమెకు అలాంటి ఆటలంటే చాలా అసహ్యం.

## వాసిరెడ్డి సీతాదేవి

ఊహాసౌధాలంటే సాధారణంగా ఆ యీడు ఆడపిల్లలు నిర్మించుకొనేవి కావు అవి. తనూ అందరు ఆడపిల్లలలాగ అత్తవారింటిలో అంట్లుతోమవలసిందేనా? ప్రొద్దస్తమానమూ యింటిచాకిరీ, అత్తమామల చాకిరీ, భర్త చాకిరీ చేసి పొట్ట నింపుకోవలసిందేనా? అత్తకు మనమళ్లను ఎత్తుకోవాలని వుంటే పిల్లలను కనవలసిన బాధ్యత కూడ తనదే. పిల్లలను కంటూ, వాళ్లు పెట్టే బాధలతో, ఏడుపులతో తీరికలేక, ఓపిక చచ్చి, విసుగుతో కూడిన జీవితాన్ని గడపవలసిందేనా? మిగతా సమయాన్ని ఎల్లమ్మ పుల్లమ్మ కబుర్లలో గడపవలసిందేనా? ఇంతకంటే స్త్రీకి సమాజంలో వేరే స్థానం లేదూ? యీ పనులన్నీ తన అమ్మ చేసింది, అమ్మమ్మ చేసింది. తను అలాంటి అతిసాధారణ జీవితాన్ని గడపలేదు. ప్రపంచంలో నూటికి నూరుమందీ గడిపేలాంటి జీవితాన్ని తను గడపదు. తనలాంటివాళ్లు వెయ్యికి ఒక్కరుకూడ వుండరు.

ఇలాగ గిరిజ ఆలోచిస్తూ వుండేది.

యస్. యస్. యల్. సి. పాసయిన తరువాత యింకా చదవాలనే వుద్దేశ్యం వున్నప్పటికి చదవలేకపోయింది. దానికి కారణం కుటుంబ ఆర్థికపరిస్థితే. బంధువులకు, కులపువాళ్ళకు యిష్టం లేకపోయినా ఆమె ఉద్యోగం చేయ నిశ్చయించుకున్నది. ఆమె తల్లిదండ్రులు కూడ ఆటంకపరచలేదు.

కొద్దిరోజుల్లోనే తెలిసినవాళ్ళ ద్వారా ఒక ఆఫీసులో ఉద్యోగం దొరికింది గిరిజకు. జీతం నెలకు ఎనభైఅయిదు రూపాయలు. మద్రాసులో అమ్మానాన్నతో కాపరం పెట్టింది.

ఆమె మాటల్లోని నిండుతనమూ, చూపుల్లోని గాంభీర్యమూ, నడకలోని ఠీవీ, చూసిన ప్రతివారూ ఆమెను గౌరవించకుండా వుండలేరు. ఆమె అందరితో చాలా ఫ్రీగా మాట్లాడేది. స్త్రీలతో మాట్లాడేప్పుడు ఎలా వుండేదో అలాగే నిర్వికారంగా పురుషులతో మాట్లాడేప్పుడు కూడ వుండేది. కొంతమంది స్త్రీలు పురుషులతో మాట్లాడేప్పుడు ఎందుకు సిగ్గుపడతారో ఆమెకు అర్థంకాదు. అలాగ కులుకుతూ, కళ్లు తిప్పుతూ సిగ్గుపడే ఆడపిల్లలంటే ఆమెకు పరమ అసహ్యం.

సిగ్గు అనేది స్త్రీలోని బలహీనత మాత్రమేనని ఆమె అభిప్రాయం. అందువల్లనే సిగ్గు నభినయించాలంటే ఆమెకు చాలా సిగ్గు. అంటే ఆమె సిగ్గు విడిచిందని కానీ బొత్తిగా సిగ్గు లేదనిగానీ అనుకోకూడదు. ఆమెకు యీ సిగ్గు అభినయించే చాలా ఆడవాళ్ళకంటే చాలా ఎక్కువ సిగ్గే. అందువల్లనే ఆమె ఎప్పుడూ చాలా జాగ్రత్తగా, నిర్వికారంగా, గంభీరంగా, వేలెత్తి తప్పకుండా జీవితాన్ని లాక్కువస్తున్నది.

మూడు సంవత్సరాలు గిరిజ జీవితం సాఫీగా గడిచిపోయింది, ఏ ఒడుదుడుకులూ లేకుండా. యీమధ్యలో ఆమెకు చాలామంది స్నేహితులు కాగయారు. స్నేహితులతో ఖులాసాగా కాలం గడుపుతుంటే ఒకదినంగా తన ఆదర్శాలన్నింటినీ మర్చిపోయిందనే చెప్పాలి అంటే ఏదో చేయాలి, ఏమో కావాలి అనే కోర్కె తగ్గింది. కాని మొత్తంమీద జీవితంలో ఏదో వెలితి అనుభ

విస్తున్నది. అదేదో ఆమెకే అర్థంకాదు ఎంత ఆలోచించినా.

క్రమంగా ఆమె వాస్తవిక జగత్తులోకి వస్తున్నది. జీవితమంటే ఏమిటో అర్థమవుతున్నది. ఒకొకసారి ఒంటరిగా కూర్చొని గంటలతరబడి ఆలోచించేది. ఒక స్త్రీ, ఒక పురుషుడు, ఏ యిద్దరు స్త్రీలలాగనో లేక ఏ ఇద్దరు పురుషులలాగనో స్నేహభావంతో ఎందుకు మెలగలేరు? ప్రపంచం అనేకవిధాలుగా ఎందుకు ఆడిపోసుకుంటుంది?


తను నాలుగురోజులు నవ్వుతూ మాట్లాడేప్పటికి రామారావు పెండ్లి చేసుకోమన్నాడు. సుబ్బారావు ప్రేమిస్తున్నానన్నాడు. అతని ప్రేమ క్షణికం కాదట. అతని ప్రేమకు ప్రతిఫలం లభించనిపక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని బెదరించాడు. రాజారావు జీవితమంతా బ్రహ్మచర్యం అవలంబిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. యిలాగ తనకు పరిచయమైన ప్రతివాడూ కొంచెం పొతిపడగానే తమ ప్రేమను ప్రకటించేవారే. యీరోజు వాళ్ళంతా పెళ్ళిళ్ళు చేసుకొని కులాసాగా జీవితం గడుపుతున్నారు. అంతేకాదు అందులో కొంత మంది తననుగురించి దుష్ప్రచారంకూడ చేస్తున్నారు.

ఒకోసారి తన ప్రవర్తనకూడ దీనికంతా కారణమేమోననే అనుమానం కలుగుతుంది. కాని తన ప్రవర్తనలో ఎలాంటి బలహీనతా కన్పించదు. ఒకటిమాత్రం ఒప్పుకోక తప్పదు. ఒక్కొక్కడూ తనదగ్గర ప్రేమను ప్రకటించి, తిరస్కరింపబడి, ముఖం వేలవేసుకుని వెళ్ళినప్పుడల్లా, తనకేదో తృప్తిగా వుంటుంది. ఒకరకమైన ఆనందం కూడ కలుగుతుంది. బహుశా అందువల్లనే కావచ్చు, తనకు తారీఖులతో సహా ఎవరిని ఏ రోజు ఎలా ఏడ్పించి పంపినదీ, యిప్పటికీ జ్ఞాపకం వున్నది.

ఒకోసారి యిదంతా ఆలోచిస్తే ఆమెకు బాధగా కూడ వుంటుంది. తనచేత తిరస్కరింపబడిన వారిమీద జాలి కలుగుతుంది. మరల యీలా సరిపెట్టుకుంటుంది. తను మాత్రం ఏమి చేయకలుగుతుంది? తనకు ప్రేమ అనే ఆ రెండు అక్షరాలకు అర్థం తెలిస్తేగదూ ప్రేమించటానికి? సాధారణంగా నూటికి నూరుమందిలో వుండే ఆ బలహీనత తనలో ప్రవేశించటం అసంభవం. అదేమిటో కాని తనను ఎవరైనా చాలా యిష్టపడుతున్నట్లు బయటపడితే ఆమె సహించలేదు. అలాంటి వారంటేనే తనకు చాలా అసహ్యం.

యీమధ్య రంగారావుతో ఆమెకు కొత్తగా పరిచయమేర్పడింది. అతనిది ఎప్పుడూ నవ్వుతూవుండే స్వభావం. ఎప్పుడూ చాలా కులాసాగా, హుషారుగా కబుర్లు చెబుతుంటాడు. బాగా చదువుకున్నవాడూ, కల్చర్ కలవాడు కూడ. గిరిజను నిలేసి 'నీకు అతనంటే యిష్టమా' అని అడిగితే చస్తే ఒప్పుకోదు, కాని అతనంటే తనకు యిష్టమా అని అప్పుడప్పుడూ ఆమెకే అనుమానం కలుగుతూండేది. కొంతకాలంపాటు రంగారావు తన ప్రేమను వెల్లడించకపోతే ఎలా పోయి ఎలా వచ్చేదో! కాని ముక్కుకు సూటిగాపోయే రంగారావు ఒకరోజు అడిగేశాడు—

'నీవంటే నాకు యిష్టం, నేనంటే నీకు యిష్టమేనా?' అని. ఆ ప్రశ్నతో గిరిజ



గేట్ వే ఆఫ్ ఇండియా

(ఫోటో:) ఎమ్. జగన్నాథరావు (జమ్షెడ్పూర్)

# ★ తిరస్కృతి ★

ఉలిక్కిపడ్డది. చాలా సిగ్గు, కోపం కలిగాయి. కాని నిబ్బరించుకుని 'లేదు' అన్నది. కాని ఆ 'లేదు' అనేప్పుడు యింతకుముందు కలిగే ఆత్మతృప్తిగానీ, ఆనందంకానీ ఈమారు కలుగలేదు. ఒకరకమైన బాధకూడ కలిగింది. తన హృదయమంతా వెతకసాగింది; ఏ మూలనైనా అతనికి స్థానమున్నదేమోనని.

తలెత్తి చూసింది. రంగారావు లేడు. ఆశ్చర్యం కలిగింది. అంత త్వరగా, తేలిగ్గా వదులుతాడనుకోలా. కొంచెం బుర్రవున్నవాడే ననుకున్నది.

ఆ రాత్రంతా గిరిజకు నిద్రపట్టలేదు.


## అతిమూత్రవ్యాధి
## వారం రోజులలో
## నెమ్మదించును

మూత్రములో అధికముగా చక్కెరపోవుట **అతిమూత్రవ్యాధిఅంటారు.(Diabetes)** ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్‌జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్‌జెక్షన్ల గుణము వున్నంతకాలము మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రము బయులు వెడలటము. దురద మొదలైనవి. ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. **పీసస్ ఫారమ్** ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటంవల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రములో చక్కెర తగ్గించి అత్యధికమూత్రము గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలిక యిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్‌జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

**50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు**

ప్యాకింగు పోస్టేజి ఉచితము

**పీసస్ రిసెర్చి లేబరేటరీ,**

**పోష్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)**


తను చేసింది పొరపాటని హృదయం ఘోషిస్తున్నది. కాని మనస్సు చాలా తెలివైనదానివని వీపు తడుతున్నది.

రెండవరోజు రంగారావు స్నేహితుడు ప్రభాకర్ అతన్ని వెతుక్కుంటూ వచ్చాడు. రాత్రినుండి అతను రూముకు రాలేదట.

ప్రభాకర్ డాక్టరు చదువుతున్నాడు. ఆవలిస్తే పేగులు లెక్కపెట్టే ఘటం. తూచితూచి మాట్లాడుతాడు. సాధారణంగా యిలా చాలా తక్కువమాట్లాడే, వాళ్ళ ఎక్కువమాటలు వ్యర్థంగాపోవు. ఇతరుల మీద చాలా ప్రభావం పడుతుంది. యిలాంటివారు వీలయినంతవరకు ఇతరుల నుండి విన ప్రయత్నిస్తూ, తాము మాత్రం చాలా తక్కువ మాట్లాడతారు.

ప్రభాకర్ ఒకటి రెండుసార్లు రంగారావుతో గిరిజయింటికి వచ్చాడు. ఆ కొద్ది పరిచయంలోనే చాలావరకు గిరిజను అర్థం చేసుకున్నాడు. అందువల్ల రంగారావును తొందరపడవద్దని హెచ్చరించాడుకూడ. మొగవాడు ఎంత తొందరపడి తన ప్రేమను వెల్లడిస్తాడో ఆడదాని దృష్టిలో అంత తేలికయిపోతాడని అతని నమ్మకం.

గిరిజనుండి సరైన జవాబు రానప్పటికీ జరిగిందంతా వూహించుకున్నాడు. 'రంగారావుకు నీవు చాలా ద్రోహం చేసినట్లు తెల్సుకున్నావా? అతన్ని నీవు సరిగా అర్థం చేసుకోలేదు. మరల చస్తే తిరిగి రాడు.' అన్నాడు ప్రభాకర్ కొంచెం తీవ్రస్వరంలో.

'దానికి నేను బాధ్యురాలను కాను. ఆడది కొంచెం స్వతంత్రంగా మాట్లాడగానే అపార్థం చేసుకోవటం, మరల తమ కేదో ఘోర అన్యాయం జరిగినట్లు వూహించుకొంటూ ప్రపంచంనుండి పారిపోవటం ఆడదానితప్పా?' చాలా తీవ్రస్వరంలో అన్నది గిరిజ.

ప్రభాకర్ మౌనంగా కూర్చొని ఆలోచిస్తున్నాడు. స్త్రీ తన ప్రేమను వెల్లడించదు. పురుషుడ్ని కవ్వించి, అతనిచేత చెప్పించి మరల తేలిగ్గా ఎందుకు చూస్తుందో? స్త్రీ ఎలాంటి పరిస్థితిలోనూ తానే ముందు బయటపడదా? ముఖ్యంగా తన సంయమశక్తిమీద అంత గర్వమూ, అహంకారమూ గల గిరిజ?

'కాఫీతాగండి తరువాత ఆలోచిద్దురుగాని' అన్నమాటతో ఉలిక్కిపడి యాదాలాపంగానే కప్పు చేతిలోకి తీసుకున్నాడు. ఎదురుగా కూర్చుని కాఫీ తాగుతున్న గిరిజ ముఖంలోకి గుచ్చిగుచ్చి చూస్తున్నాడు. అతనలా చూడటం గిరిజకు చాలాసిగ్గుగావున్నది. అటూ యిటూ చూస్తూ అతన్ని సంభాషణలోకి దించ ప్రయత్నిస్తున్నది. కాని మౌనంగా కూర్చొని ఆమె మాటలను మాత్రమే వింటున్న ప్రభాకర్ ముందు ఎక్కువసేపు మాట్లాడలేకపోయింది. టేబుల్ మీదవున్న పుస్తకాన్ని తిరగేస్తూ కూర్చున్నది.

'యింక నే వస్తాను' అంటూ జవాబుకు ఎదురుచూడకుండానే వెళ్ళిపోయాడు ప్రభాకర్. ప్రభాకర్ లాంటి మగవాళ్ళను గిరిజ జీవితంలో మొదటిసారిగా కలుసుకున్నది. ఇంతకుముందు కలుసుకున్నవ్యక్తి కొత్తవల్లనూ, రంగారావు కూడ వుండటంవల్లనూ అతనలా మౌనంగా వున్నాడనుకున్నది. యింకొకసారి ప్రభాకర్‌ను కలుసుకుంటే బాగుండు ననిపించింది. మరలకాలు జారుతున్నది జాగ్రత్త అని లోలోన ఎవరో హెచ్చరిస్తున్నారు.

ఎంత మర్చిపోవాలని ప్రయత్నిస్తున్నదో ప్రభాకర్ అంత జ్ఞాపకం వస్తున్నాడామెకి. ఆఫీసు పనిలోకూడ మనస్సు పోవటంలేదు. మరల తనయింటికి వస్తాడా? ఒకవేళ రాకపోతే? రాకపోతే తనకేం? లేదు, తప్పక వస్తాడు. ఆఫీసు పనిలో విసుగు కలిగినప్పుడల్లా అరచేతిలో ప్రభాకర్ పేరు రాసి రాసి చెరుపుతూన్నది. యీ వారంరోజుల్లో ఎక్కడ ఏ పేపరు దొరికినా ప్రభాకర్ పేరు రాయడం జరుగుతున్నది. తనలో బలహీనత ఏర్పడుతున్నది. చివరకు తనూ, అమ్మ, అమ్మమ్మల జీవితాన్ని గడపటానికే తహతహలాడుతున్నది కాదు, ఎప్పటికీ కాదు. తన వున్నతభావాలేమైనవి?

ఇక తను ప్రభాకర్ పేరుకూడ ఉచ్చరించదు. తనుతప్పక ఆదర్శమయమైనజీవితంగడపాలి. అంటే ఏంచేయాలి? ఉద్యోగంలో ప్రవేశించకముందు ఉద్యోగం చేయటమే జీవితాదర్శమనుకున్నది. కాని యిప్పుడు ఏదో అసంతృప్తి తనను వెంటాడుతూంది. ఎనభైఅయిదు రూపాయల చాలీచాలని జీతం. పొద్దస్తమానం సిరామరకలతో నిండి నలిగివున్న ఫైల్సూ, సిరాబుడ్డి, కలం, యిదేనా తన జీవితం. ఆదర్శమయ జీవితం?

కాదు. తను తప్పక పైకిపోవాలి. ప్రైవేటుగా యింటరు, బి. ఏ పాసు కావాలి. తరువాత? కొంచెం ఎక్కువ జీతం యిచ్చే ఉద్యోగం వస్తుంది. సరి బాగానేవుంది. ఆ తరువాత? జీతం పెరగటమేనా జీవితాదర్శం?

కాదు. మరి? ప్రభాకర్‌ను పెండ్లిచేసుకుంటే? ఛీ. విసుగుతో మధ్యాహ్నం సగం

వరకూ చదివిన నవల తీసుకుంది చేతిలోకి.

మరల ఆలోచనలు ఈగల్లాగ ముసురుకుంటున్నాయి. అందులోని కథానాయిక స్వభావంకూడ తన స్వభావంలాంటిదే. కాని ఒక భేదంమాత్రం కన్పిస్తున్నది. తన జీవితలక్ష్యం ఒకటంటూ నిర్ణయించుకోలేక పోతుంది. కాని ఆమె మాత్రం తన జీవిత లక్ష్యాన్ని దేశసేవగా పెట్టుకున్నది. మగవాళ్ళతో ఎంత చక్కగా, ధైర్యంగా కలిసి మెలిసి పనిచేస్తుంది? ఆ మగవాళ్లుకూడ తను చూసినవాళ్ళకు భిన్నంగానే వున్నారు. ఎంత చక్కగా దేశ, విదేశాల సమస్యలను గురించి చర్చించుకుంటారు! ఎవరు ఎవర్నీ అనుమానించరు. అసలు వారు స్త్రీ పురుష భేదాలను గుర్తిస్తున్నట్లే కన్పించదు. తనుకూడ ఏ విప్లవకారులముఠాలోనో చేరితే?

కాని తనలో అంత ధైర్యమూ శక్తి వుందా? రాత్రిళ్లు వంటరిగా నాలుగుగోడల మధ్యవుండడానికే భయపడుతుంది. అలాంటి ఆమె కొండగుహల్లో అరణ్యాల్లో వుండగలదా?

గిరిజ మొదటినుండి యిలాంటికలలతోటే కాలం గడిపేది. కాని యిప్పుడు బలహీనతను దాచుకోవటానికి పగటి కలలు మరింత ఎక్కువైనాయి. కలలు కనటం తప్పుగాదు. కాని ప్రతికలా నిజంకావాలని ఆశిస్తూ వాస్తవికజగత్తునుండి పారిపోవ ప్రయత్నించటమే గిరిజ చేసినతప్పు.

ఆదివారంవచ్చింది. ప్రభాకర్ వచ్చాడు. గిరిజ గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. అతన్ని కూర్చోమంటూ నేపోయి అద్దంముందు నిలబడింది. పౌడరు కొట్టుకొని ముంగురులు సరిచేసుకొనివచ్చి కూర్చున్నది.

'ఏమండీ, ఎక్కడికేనా వెళ్లుతున్నారా?' అన్నాడు ప్రభాకర్ 'లేదే, ఏమి?' అన్నది గిరిజ, అలా ఎందుకడుగుతున్నాడో అర్థం కాక. 'అః ఏంలేదు, పౌడరు వేసుకొని వచ్చారులాగున్నది. అందువల్ల బయటకు వెళ్ళబోతున్నారేమో అనుకున్నాను' అన్నాడు వచ్చేనవ్వు ఆపుకుంటూ.

గిరిజకి తల కొట్టేసినట్లయింది. యింకొకరయితే యీపాటికి గెట్ అవుట్ అని వుండేది. అసలు యింకొకరు మాట్లాడేప్పుడు తనకు పౌడరు వేసుకోవాలని పిస్తేగదూ? చివరకు చేసేదేమీలేక చాలా కొంటెగా మాట్లాడుతాడని సరిపెట్టుకున్నది.

మరల నిశ్శబ్దం. గిరిజ చాలా యిరుగ్గా ఫీలవుతుంది. తనకు ఏ రోజూ ఎవరిముందూ సిగ్గు కలగంది, ప్రభాకర్ ముందు ఎందుకో అంత సిగ్గు? అతన్ని చూస్తేనే అదోలా వుంటుంది. ఎలా వుంటుందని ఎవరైనా అడిగితే తనకు చెప్పటం రాదు. అతను ఏమన్నా తనకు కోపంరాదు. పైగా అతని ఒక్కొక్క మాట తన హృదయంలో చక్కలిగింతలు పెడుతుంది.

'ఏమిటో చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నారు' అన్న ప్రభాకర్ మాటలకు గిరిజ ఉలిక్కిపడి అతని ముఖంలోకి చూసింది. అతను సిగరెట్టుపొగ వూదుతూ ఆ అలలలోకే దీక్షగా చూస్తున్నాడు. అతను తనను చూడటంలేదు కాబట్టి అతని ముఖాన్ని చూస్తున్నది. యింకా కొంచెంసేపు అలా వుంటే బాగుండు ననిపించింది. ప్రభాకర్ కళ్ళతో ఆమె కళ్లు కలవగానే రెప్పలు సిగ్గుతో బరువుగా వాలిపోయాయి.

క్రమంగా రెండు వంవత్సరాలు రెండు రోజుల్లాగ గడిచిపోయాయి గిరిజకు. ప్రభాకర్ దాదాపు ప్రతి ఆదివారం వస్తూనే వున్నాడు. రెండు సంవత్సరాలక్రితం ఒకరికొకరు ఎంత దూరంగా వున్నారో యిప్పుడూ అంతే. ఒకరికంటే ఒకరు చాలా మర్యాదగా, తెలివిగా, తూచితూచి మాట్లాడతారు. కాని ఎంత జాగ్రత్తగా వున్నా గిరిజమాత్రం అప్పుడప్పుడూ ప్రభాకర్‌కు చిక్కిపోతూనే వుంది.

ఒకోసారి గిరిజకు తనమీద తనకే జాలి కలుగుతుంది. గంటల తరబడి ప్రభాకర్ హృదయంలోని భావాన్ని గ్రహించటానికి ఆలోచించేది. తనను ప్రభాకర్ ఎందుకు యిలా ఏడ్పిస్తున్నాడు? తనను యిలా వూబిలోకి లాగి ఏడ్పించినందువల్ల అతనికి కలిగే లాభం ఏమిటి? అతను నిజంగా తనను ప్రేమిస్తున్నాడా? ప్రేమిస్తే యింతకాలం బయటబడకుండా వుండగల్గుతాడా? అలా వుండబట్టే కాదు తను అతన్ని ప్రేమి... కాదు యిష్టపడుతుంది. లేకపోతే యీ ప్రభాకర్ అందరిలో ఒకడైపోయేవాడే గదూ?

బహుశా అతను తన స్వభావాన్ని అర్థం చేసుకొనే తన ప్రేమను గుప్తపరుస్తున్నాడేమో! అలాగయినా, యిప్పుడు అతనంటే తనకు పూర్తిగా యిష్టమని తెలుసుకున్న తరువాతనైనా ఎందుకు బయటపడకూడదు? కొన్నిసార్లు కొన్ని విషయాలలో తనే తొందరపడి సిగ్గుపడ్డది. అప్పుడు కూడ అతను తనకు ఏమీ అంటనట్లే ప్రవర్తించేవాడు.

ఒకోరోజు అతని నిర్లక్ష్యతను చూస్తుంటే ఆమెకు చాలా కోపం, బాధకూడ కలిగేవి. ఆడవాళ్లు యిలా బాధపడేప్పుడు చూడటం అతనికి సరదా యేమోనని అనుమానం కలిగేది. తనుమాత్రం తక్కువేం తిన్నది? పాపం. ఆ రంగారావు ఎంత బాధపడ్డాడో? ఎక్కడ వున్నాడో, ఎలావున్నాడో కూడ ఎవరికీ తెలియదు. ఎంత కపటంలేని మనిషి? అతని ప్రేమనే స్వీకరించివుంటే? తనను దేవతలాగ పూజించి వుండేవాడు.

చివరిచివరకు ప్రభాకర్ కేవలం తనను ఏడ్పించటానికే యిలా స్నేహం చేస్తున్నాడని వూహించుకుంటుంది. అతనిపరిచయమైన మొదటినాటినుండి ఏరోజైనా, ఏ మాటల్లోనైనా ఆమెను ప్రేమిస్తున్నట్లు కన్పిస్తాడేమో నని గంటలకొద్దీ ఆలోచించేది.

అబ్బే లేదు. తన గుర్తున్నంతవరకు అతని మాటలవల్ల తన హృదయ బలహీనతను బయటకులాగి విజయగర్వంతో చిరునవ్వు నవ్వేవాడేకాని అతనుమాత్రం ఎప్పుడూ తనకు చిక్కలేదు.

ఒకరోజు తనకు చాలా యిష్టమయినచీరె కట్టుకున్నది. ప్రభాకర్ వచ్చినవాడు వూరుకున్నాడా? 'యీ చీరెలో మీరు చాలా అందంగా ఉన్నాననుకుంటున్నారుగదూ?' అన్నాడు. తన హృదయం చాలా బాధపడింది ఆరోజు. యింకొకరోజు 'పాపం, మీరు చాలా జాగ్రత్తగానే వుంటారు, కాని అప్పుడప్పుడు మాత్రం మీకు తెలియకుండానే బయటపడుతుంటారు' అన్నాడు.

పోయినఆదివారంరోజు అతను జేబులోనుండి సిగరెట్టుపెట్టె తీసుకొనేప్పుడు ఒక ఫోటో క్రిందపడింది. అది చేతిలోకి తీసుకొని చూసింది. ఒక అందమైన అమ్మాయి ఫోటో. తనుఫోటో చూస్తుంటే, ప్రభాకర్ తనముఖం చూస్తున్నాడని గ్రహించుకుని అడిగింది 'యీ అమ్మాయి ఎవరూ?'

'నీలాంటి ఒక స్నేహితురాలు.'

ఆ మాటకు తను చాలా బాధపడ్డది. పలక్కుండా ఫోటో టేబుల్ మీద పెట్టింది.

'ఏం, యీర్ష్య కలుగుతుందా?' అన్నాడు నవ్వుతూ కళ్ళలోకి చూస్తూ.

'నా కెందుకయ్యా యీర్ష్య?' అంటూ నవ్వ ప్రయత్నించింది.

'అదేమాట నా కళ్ళలోకి చూస్తూ చెప్పండి' అన్నాడు. తనకు నిజంగా కోపంకూడ వచ్చింది.

'అంటే, మీ అభిప్రాయం?' అన్నది కొంచెం తీక్షణంగానే. కాని ఆమాట అనేప్పుడు అతని ముఖంలో కాక ఎక్కడకో చూస్తున్నది.

యిదంతా ఒకసారి తిరిగి తల్చుకుంటే ఆమెకు ఎప్పుడూ ఎక్కడా ప్రభాకర్ తనను ప్రేమిస్తున్నట్లు కన్పించలేదు.

ఒకోరోజు విసుగుపుట్టేది గిరిజకు. ఇలా ఎన్నిరోజులు? పోనీ తనే తన ప్రేమను ప్రకటించి అతని అభిప్రాయం అడిగితే? కాని ఒకవేళ ప్రభాకర్ తన ప్రేమను త్రుణీకరిస్తే? బాధకంటే ముందు అవమానంతో తను ఆత్మహత్యం చేసుకోవాలింక

# ★ తిరస్కృతి ★

ఎంత బాధనైనా హృదయంలో దాచుకొని తను బ్రతకగలుగుతుంది కాని, ఒకసారి అవమానింపబడి తను బ్రతకలేదు ప్రభాకర్ ఒప్పుకున్నా, ముందు తానే అతన్ని పెండ్లిచేసుకోమని కోరి దాంపత్య జీవితం సుఖంగా గడపగలుగుతుందా? లేదు, జీవితమంతా ప్రభాకర్ తనమీద దయదలచి చేసుకున్నట్లు ప్రవర్తిస్తాడు తను అణిగిమణిగి పడివుండాలి

ఇలాంటి మానసిక సంఘర్షణలోనే మూడు సంవత్సరాలు దొర్లిపోయాయి యిప్పుడు ప్రభాకర్ కాశాస్ సర్జన్‌గా పని చేస్తున్నాడు. గిరిజ జీవితంలో ఏ మార్పూ లేదు. 'గొర్రెతోక బెత్తెడే' అన్నట్లున్నాయి జీతం, జీవితం


గిరిజ ఆశలన్నీ నిరాశలుగా మారుతున్నాయి. జీవితంమీదనే విరక్తి కలుగుతున్నది. ప్రభాకర్ మొదటినుండి చివరివరకు తనకు ఒక ప్రశ్నలాగ తయారయాడు. ప్రభాకర్ మనస్సులోని అభిప్రాయాన్ని గ్రహించే శక్తి తనకు లేదు

చివరకు అతను తనను ప్రేమించటం లేదని నిర్ణయించుకున్నది. ఎలా ప్రేమిస్తాడు? అతను ఒక డాక్టరు, డబ్బున్నవాడు. పైగా అందగాడినన్నే కీర్తి కూడ వున్నది. మరి తనో, ఒక మామూలు క్లార్కు చెప్పుకోతగ్గ అందమూ లేదు. పెద్దలు సంపాదించినదైనా ఇంత వున్నదా అంటే అదీ లేదాయె మరి యిక తనలో ఏ గుణాన్ని చూసి ప్రభాకర్ తనను ప్రేమిస్తాడు! యీ ఆలోచనే మూడు సంవత్సరాల క్రితం తట్టి వుంటే? ఇప్పుడు సమయం మించిపోయింది. అక్కడనుండి వెనక్కుపోలేదు. జీవితయాత్రలో ఎంతోమంది వ్యక్తులతోటి పరిచయం కలుగుతుంది. అందులో చాలా కొద్దిమంది మాత్రం హృదయకవాటంవరకూ ప్రవేశిస్తారు. ఆ కొద్దిమందిలో ఏ ఒకరిద్దరో లోపలకు తొంగి చూడగలుగుతారు. కాని లోపలకు ఒక్కరుమాత్రమే ప్రవేశింపగలరు. ఆ అదృష్టం ఏ కొద్దిమందికో కలుగుతుంది.

రామారావు, సుబ్బారావు మొదలైనవారు తన హృదయకవాటంవరకూ వచ్చికూడ విఫలులై వెళ్ళిపోయారు. రంగారావు తొంగి చూడగలిగాడు. కాని యీ ప్రభాకర్ సునాయాసంగా లోపలప్రవేశించటమేకాకుండా హృదయాన్నంతా ఆక్రమించుకున్నాడు.

యీమధ్య ప్రభాకర్ గిరిజయింటికి రావటం తగ్గించాడు. వచ్చినా ముళ్ళమీద నిల్చున్నట్లు కన్పిస్తాడు. గిరిజమీద దయదలచి వస్తున్నట్లుంటుంది అతనిమాటలధోరణి. గిరిజహృదయం అతను యింత నిరక్ష్యంగా నిర్దయగా మాట్లాడుతూంటే బాధతో మూల్గేది కాని ఆమూల్గు ప్రభాకర్ చెవుల వరకూ పోకుండా అణిచిపట్టేది.

అతను వెళ్లిపోతూంటే 'మరల ఎప్పుడు వస్తారూ?' అని అడగాలనిపించేది కాని ఆత్మాభిమానం ఆమె పెదాలను బంధించేది. అతని రాకపోకలవల్ల తనకు ఎలాంటి ఆనందమూ, బాధ లేనట్లు ప్రవర్తించేది.



**తాజ్‌మహల్**

ఫోటోలు: ఎమ్. జగన్నాథరావు (జమ్‌షెడ్పూర్)

ఒకోసారి అతను తనను చాలా తేలిగ్గా చూస్తున్నాడనే భావం రాగానే ఆమెకు అభిమానం వచ్చేది. హృదయానికి దెబ్బ తగిలేది. యీసారి అతను వచ్చినప్పుడు తనూ చాలా నిర్లక్ష్యంగా ప్రవర్తించాలని వూహించుకొనేది. ఒకోరోజు వీలయినంత వరకు అవమానపరచి 'నీవు వూహించుకుంటున్నట్లు నీమీద నా కేమంత ప్రేమ ఒలికిపోవటం లేదులే' అన్నట్లు ప్రవర్తించాలనుకొంటుండేది.

కాని ప్రభాకర్ ను చూడగానే ఆమె కోపమంతా మంచుగడ్డలాగ చల్లబడిపోయేది. దీపంముందు కరిగిపోయే కొవ్వొత్తిలాగ ఆమె ఆత్మాభిమానం ప్రభాకర్ మౌనం ముందు కరిగిపోయేది.

ఒకరోజు ప్రభాకర్ అకస్మాత్తుగా రాత్రి ఎనిమిది గంటలకు వచ్చాడు. గిరిజ కిటికీ దగ్గర కుర్చీలో కూర్చొని ఎక్కడో శూన్యంలోకి చూస్తూంది. ఆమె కళ్ళవెంట నీరు కారుతున్నది. ప్రభాకర్ దగ్గరంత వరకూ ఆమె యీ ప్రపంచంలోకే రాలేదు.

అతను చూడకుండా కన్నీళ్లు తుడుచుకో ప్రయత్నించింది. 'ఏడుస్తున్నా రెందుకండీ?' అన్న అతని మాటలకు సిగ్గుపడింది.

అతని ముఖంలోకి చూసింది. అదే కొంటెచూపు, చిరునవ్వు, మౌనం. గిరిజ శరీరమంతా అవమానంతో బాధతో వణికిపోయింది. గుండెల్లో గంగాళాలు కుతకుత లాడుతున్నాయి. 'ఛీ, రాక్షసుడా, నా జీవితాన్ని నాశనం చేశావు' అని గట్టిగా అరవ బుద్ధయింది. కాని అరవలేదు. వణుకుతున్న పెదాలతోనే వుద్రేకాన్ని అణుచుకున్నది. ఎలా తిడుతుంది? ఏమని తిడుతుంది? ప్రభాకర్ తన పాత్రను చాలా నేర్పుగా నిర్వహించుకున్నాడు. అతను తనకు ఏమయినా మాట ఇచ్చాడా? లేక ఏమన్నా ఆశలు చూపించాడా? ఆశలు చూపలా? చూపాడు కాని నోటితో కాదు, మౌనంగానే...

'మీరూ అందరుఆడపిల్లల్లాగానే ఏడుస్తారన్నమాట' యీ మాటల్లోని వ్యంగ్యం గిరిజను చాలా బాధపెట్టింది.

'అంటే మీ అభిప్రాయం?"

'అఁ ఏమీ లేదు. ఎందుకు ఏడుస్తున్నారా అని ఆలోచిస్తున్నా. నూటికి నూరుమంది ఆడపిల్లల్లో వుండే బలహీనత మీలోనూ కన్పించటం చాలా ఆశ్చర్యంగానే వున్నదినుమా!'

'అదంతా మీ కనవసరం. మీరు మీ స్థానాన్ని గుర్తుంచుకొని మాట్లాడండి. ఒక్క విషయంమాత్రం తెలుసుకోవాలని నా మనవి. మీకూ యీ ఏడ్పుకూ ఎలాంటి సంబంధమూ లేదు"

'నిజంగానా?' అంటూ తన కళ్ళలో ఏదో చదవటానికి ప్రయత్నిస్తున్న ప్రభాకర్ మీద అసహ్యం కోపం కలిగాయి. 'మీరేదో అపోహపడుతున్నారులాగున్నది. మీరు వూహించేది ఏమాత్రం నిజంగాదని తెలుసుకోవాలని నా మనవి. దయచేసి మీరు మా యింటికి రావటం తగ్గిస్తే కూడ మంచిదే.'

'క్షమించండి. పాపం. ఈ రోజు మీ మనస్సు మీ వశం తప్పిపోతోందిలా వుంది. నేను అనవసరంగా మిమ్మల్ని బాధపెట్ట దల్చలేదు. కాని వెళ్లేముందు ఒక్క విషయంమాత్రం చెప్పదల్చుకున్నాను. మిమ్మల్ని నేను ఎప్పుడూ తేలిగ్గా చూడలేదు. అంతేకాదు. నేను మిమ్మల్ని చాలా గౌరవంగాకూడ చూస్తున్నాను. ఎప్పుడైనా మీకు నా అవసరముంటే కబురు చేయండి వస్తాను. జీవితంలో మీరు ఏదికోరినా చేయటానికి సిద్ధంగా వున్నాను."

గిరిజకు కోపంతో శరీరం వణికిపోతుంది. ఎంతగర్వం అనుకున్నది.

'మీరు నాకు చేయగలిగింది, నేను మిమ్మల్ని కోరదగింది నాకేమీ కన్పించటం లేదు' అన్నది గిరిజ.

'దానికేంలెండి. మనిషికి మనిషి ఎప్పుడైనా అవసరమౌతారు' అంటూ తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు ప్రభాకర్. ఆ చివరివాక్యాలు వణుకుతున్న కంఠంలోనుంచి వచ్చాయి. మొఖంలో కళ్ళలో ఒక రకమైనబాధకూడ కన్పించింది గిరిజకు.

వెళ్లిపోతున్న ప్రభాకర్ ను 'ప్రభాకర్! నిన్ను ప్రేమిస్తున్నాను. పెండ్లిచేసుకోవూ' అని అరుద్దామనిపించింది. కాని అంతలోనే ప్రభాకర్ వెళ్ళిపోయాడు.

నెలరోజులు గిరిజకు చాలా ఘోరంగా భయంకరంగా గడిచిపోయాయి. ప్రభాకర్ వస్తాడని ఎదురుచూసింది. రోజులు పిడికల్లాగ గడిచిపోతున్నాయి. కొద్దిరోజుల తరువాత జ్వరం వచ్చింది. వారంరోజుల వరకూ జ్వరం తీవ్రత తగ్గలేదు. హాస్పటల్లో చేర్చారు. ఆరోజు ఆమెకు పూర్తిగా స్పృహ లేదు.

* * *

'డాక్టర్...నన్ను...పెండ్లి...చే...సు...కోరూ' అంటూ డాక్టరు మధుసూదన రావు చెయ్యి గట్టిగా పట్టుకున్నది గిరిజ.

డాక్టరు ఆలోచిస్తున్నాడు. యీమె రాత్రినుండి యిలాగనే పలవరిస్తున్నది. తెల్లవారుతుంది. కాని ఆమె డెలీరియమ్ తగ్గలేదు సరిగదా ఆమె పరిస్థితి యింకా ఘోరంగావుంది. యిప్పుడు తన కర్తవ్యమేమిటి? తను చేసుకుంటానంటే యింతలో తన సొమ్మేమిపోతుంది? కనీసం ఆమె ఆత్మశాంతితోనైనా వెళ్లిపోతుంది. ఒకవేళ ఆమె బ్రతికి బయటపడుతుందా, ఒక ప్రాణదానం చేసినవాడవుతాడు. తరువాత నిజంగానే పెండ్లి చేసుకోమంటే? తను ప్రేమిస్తున్న లలితపనేం కావాలి? లలితను తను ఎంత బాధ పెట్టాడు? పదిహేను రోజులనుండి వెళ్ళనేలేదు తను లలితను చూట్టానికి.

'డాక్ట...ర్...పెం...డ్లి' అన్న క్షీణస్వరం అతని ఆలోచనలకు అంతరాయం కలిగించింది. ఆమె చెయ్యి తన చేతినివదిలి మంచంమీద పడిపోయింది. తల ప్రక్కకు వాలిపోయింది. ఆమె అశాంత హృదయం పూర్ణశాంతిని పొందింది.

డాక్టరు కళ్లనుండి రెండు వేడి కన్నీటి చుక్కలు రాలాయి. ఎవరిదో 'గిరిజా' అన్న బాధతోకూడిన స్వరంతో ఉలిక్కిపడ్డాడు డాక్టర్ మధుసూదనరావు.

ఎవరది? ప్రభాకరా? డాక్టర్ ప్రభాకర్? అతనికీ యీమెకూ ఏమి సంబంధం?

గిరిజ చల్లని చేతిని రెండు చేతులతో తీసుకొని ముఖానికి అద్దుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు ప్రభాకర్. డాక్టరుకు బాధకంటె ఎక్కువ ఆశ్చర్యం కలుగుతున్నది.

ప్రభాకర్ భుజముమీద చెయ్యి వేసి 'అదేమిటి, ప్రభాకర్? ఎప్పుడూ తొణకని వాడివి అలా ఆడపిల్లలాగ ఏడుస్తున్నావు? యీ అమ్మాయి నీకు తెలుసా?' అన్నాడు.

'అవును తెలుసు. మే మిద్దరం ఒకరినొకరు ప్రేమించుకున్నాము. వీణ తీగెలు బిగించినకొద్దీ మంచి శబ్దం పలుకుతుంది. కాని మేము చేసిన తప్పల్లా తెగేంత వరకూ బిగించటమే' అంటూ పిచ్చివాడిలాగ వార్డునుండి వూగుతూ వెళ్ళిపోయాడు.

డాక్టరు ప్రభాకర్ వాక్యాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నంలో అదేవాక్యాన్ని వల్లించాడు "మేము చేసినతప్పు, తెగిందాకా బిగించటమే" అని. ఒకసారి ప్రభాకర్ వెళ్లేవైపుకూ మరల గిరిజశవంవైపుకూ చూసి 'తెగిపోయిన తీగెలు' అంటూ ఒక దీర్ఘనిట్టూర్పు విడిచి, కుర్చీలో కూలబడ్డాడు. ★


## కుష్ఠం ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. ఫ్యాటలాగు ఉచితము; సలహాకు జి. ఎ. రెడ్డి & కో. (రిజిష్టర్డు)

"భాస్కరాశ్రమము."

గోపాలపురం. తూర్పుగోదావరి.